## క్లుప్తంగా

### గ్రామాల అభివృద్ధే ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

**కంచిలి:** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి బాసుబంజిరి, సామంత బొనమాళి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో విశ్రాంతి మండపాల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ గణప సింహాచలం, బొండాడ వైకుంఠరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, దుర్గాసి ధర్మారావు, కొంబపల సురేష్, గుమ్మడి చంద్రయ్య, వంకల జయరాం, గణప పితంబర్, కుణితి తిరుపతి, వంకల దుర్యోదన, పురెళ్ల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**సోంపేట:** మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన దున్న తులసమ్మ ఇటీవల పాముకాటుతో మృతి చెందింది. ఆమె స్థానిక ఉన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు చదువుకుంది. ఆమెతో పాటు 1996 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.62,500లు తులసమ్మ కుమార్తెలకు ఆదివారం అందజేశారు. అలాగే మామిడిపల్లి గ్రామస్తులు రూ.22,500 సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దున్న మాధవరావు, సంగారు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### చురుకుగా అభివృద్ధి పనులు



సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

**మందస:** గత పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన మందస పట్టణం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతోంది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రత్యేక చొరవతో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటికే రహదారుల విస్తరణ, అనంతరం సెంటర్ డివైడర్ల నిర్మాణం పనులు కూడా పూర్తయ్యాయి. దీనిలో భాగంగా సెంట్రల్ లైటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు.

### బెస్ట్ క్లబ్‌గా సోంపేట రోటరీ



అవార్డు అందుకుంటున్న రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు

**సోంపేట:** సోంపేట రోటరీ క్లబ్‌కు బెస్ట్ రోటరీగా అవార్డు వచ్చినట్లు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు దుద్ది శ్రీనివాసరావు, పి.వి కృష్ణారావు తెలిపారు. రోటరీ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలు గుర్తించి, విజయనగరంలో ఆదివారం జరిగిన 3020 సమ్మోహనం మెంబర్ షిప్ డవలప్‌మెంట్ సెమినార్‌లో రోటరీ గవర్నర్ దత్తా అవార్డు అందజేసినట్లు పేర్కొన్నారు. దీంతో పలువురు అభినందనలు తెలియజేశారు.

### శరవేగంగా ఇంటింటా ఓటర్ల సర్వే



గొండ్యాలపుట్టుగలో ఓటరు వివరాలు సరిచూస్తున్న సర్వే సిబ్బంది

**కవిటి:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటా ఓటర్ల సర్వే శరవేగంగా నిర్వహిస్తున్నారు. కవిటి, గొర్లెపాడు తదితర పంచాయతీల్లో ఆదివారం సర్వే నిర్వహించారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణ, చనిపోయినవారి ఓట్లు తొలగింపు, ఓటరు ఇంటి నంబర్ నమోదు తదితర ప్రక్రియలు చేపట్టారు. ఈ ప్రక్రియ ద్వారా పారదర్శకమైన ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నారు.

### ఉచిత వైద్య శిబిరం నేడు

**నందిగాం:** మండల కేంద్రం నందిగాం అంబేడ్కర్ జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జగనన్న సచివాలయ కన్వీనర్ల చైర్మన్ జద్యాడ జయరాం సూచించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.



కవిటి: పుటియాదళ రెవెన్యూలో వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు

# ముమ్మరంగా ఖరీఫ్ పనులు



వజ్రపుకొత్తూరు రూరల్: బెండి పరిసర ప్రాంతాల్లో పనుల్లో నిమగ్నమైన రైతులు

ఇటీవల మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. దమ్ము చేయడం, గట్లు సరిచేయడం, నారు తీర, వరినాట్లు వేయడంలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. అయితే పూర్తి వరకు వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

## నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

**వజ్రపుకొత్తూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనబడి నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని నువ్వలరేవు సర్పంచ్ ముువ్వల యజ్ఞా, ఉప సర్పంచ్ ముువ్వల దేవా అన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు చొరవతో నువ్వలరేవు(ఎల్‌డీపేట) ప్రాథమికోన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించారు. వారం రోజుల క్రితం చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో(దాదాపు 15 వందల మంది) విద్యార్థులు ఉన్న నువ్వలరేవు పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేని పరిస్థితి గతంలో ఉండేదని, ప్రస్తుతం పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోకి నీరుచేరి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను, క్రీడా మైదానం కొరత విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూలంగా స్పందించి పాఠశాల మైదానం అభివృద్ధికి హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలిపారు. పనులు పరిశీలించిన వారిలో గ్రామ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బెహరా నీలాంబర్, ఎంపీటీసీ సభ్యుడు బైనపల్లి రామకృష్ణ, శ్యామ్ తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

**మందస:** పశువులకు సీజనల్ వ్యాధులు సోకుతుండడంతో గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మందస పశు వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, హరిపురం పశు వైద్యాధికారి కిల్లి ఉమా భారతి చెప్పారు. మహదేవపురంలో ఆదివారం ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం లంపిస్కిన్ వ్యాధి(ముద్ద చర్మవ్యాధి) పశువులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. లంపిస్కిన్ వ్యాధి లక్షణాలు కనిపించిన తక్షణమే పశు వైద్యాధికారి, సిబ్బందిని సంప్రదించాలన్నారు. సుమారు 13,200 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, ఈనెల 31 వరకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది ద్వారా ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. అదేవిధంగా వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి టీకాలు కూడా ఉన్నాయన్నారు. వర్షాకాలంలో రైతులు, పశు యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారితో పాటు మందస, హరిపురం పశు వైద్య సిబ్బంది ఉన్నారు.

### పరామర్శ



పీఆర్వో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విజయ తదితరులు

**ఇచ్ఛాపురం:** జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ప్రభుత్వ పీఆర్వోగా విధులు నిర్వహించిన రఘుపాత్రుని రమణమూర్తి శనివారం గుండెపోటుతో మరణించారు. దీంతో పట్టణంలోని పీఆర్వో కుటుంబ సభ్యులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు ఆదివారం పరామర్శించారు. పీఆర్వో కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు.

### గద్దర్ మృతికి సంతాపం

**నందిగాం:** ప్రజా గాయకుడు గద్దర్ ఆకస్మిక మృతికి లట్టిగాం పీఏసీఎస్ చైర్మన్ కురమాన బాలకృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా గద్దర్ చేసిన ప్రజా పోరాటాలను గుర్తు చేసుకున్నారు.

**టెక్కలి:** తన జానపద సాహిత్యంతో ఉద్యమాలకు ఊపిరిపోసిన ప్రజా గాయకుడు గద్దర్ మరణం తీరని లోటు అని జన చైతన్య మండలి సభ్యులు సుంకు గోపినాథ్, దువ్వాడ జగన్నాథ్, కె.దమయంతి, చిరంజీవి, అక్కురాడ మాధవరావు, పీస ఆదవరావు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్నో ప్రజా పోరాటాల్లో గద్దర్‌తో కలిసి చేసిన ప్రయాణం మరచిపోలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన చైతన్య మండలి నుంచి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

### కుండపోత వర్షం

**వజ్రపుకొత్తూరు రూరల్:** మండలంలోని ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో రహదారులు, రోడ్లు జలమయమయ్యాయి. కాగా ప్రస్తుతం వరి పంట సాగు చేస్తున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## చదరంగంతో మెదడుకు పదును



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

**టెక్కలి:** చదరంగంతో మెదడుకు పదును పెట్టవచ్చునని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు సంబంధించి టెక్కలిలో గోడ పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. విద్యార్థి స్థాయి నుంచి ప్రతీ ఒక్కరూ చదరంగంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు, నాయకులు దువ్వాడ శ్రీధర్, పి.జనకమోహన్‌రావు, కె.కృష్ణారావు, బి.రమేష్, బి.శ్రీనివాస్, మదీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవం



కాశీబుగ్గ: 108 సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం



కంచిలి: వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కడుతున్న దృశ్యం

**కంచిలి:** మండలంలో మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు సంస్థ వ్యవస్థాపకులు, సభ్యులు ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

**కాశీబుగ్గ:** ప్రభుత్వం అమలు చేస్తున్న 108 అంబులెన్స్‌లో సేవా దృక్పథంతో పనిచేస్తున్న సిబ్బందికి పలాస లయన్స్ క్లబ్ ఆఫ్ కాజ్యూలాండ్ వనిత విభాగం సభ్యులు ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో వనిత విభాగ కార్యవర్గం మల్లా జయ, శ్వేతాకుమారి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## కబేళాలకు తరలిస్తున్న ఆవులు పట్టివేత



పట్టుబడిన ఆవులు, వ్యానుతో పాటు డ్రైవర్

**కాశీబుగ్గ:** ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వైపు వ్యాన్‌లో ఆవులను తరలిస్తున్న విషయం తెలుసుకున్న పలాసకు చెందిన యువకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వ్యాన్ డ్రైవర్ ఆపకపోవడంతో పాటు దురుసుగా పలాస మండలం జాతీయ రహదారి మీదుగా వెళ్లాడు. అయితే టోల్‌గేటు వద్దకు వెళ్లేసరికి పట్టుబడడంతో వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించడంతో డ్రైవర్, ఆవులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## పేకాట రాయుళ్లు అరెస్ట్

**ఇచ్ఛాపురం రూరల్:** మండలంలో కొఠారీ గ్రామ పొలిమేరలోని బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ వి.రమేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కొంతమంది యువకులు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్లు స్పష్టం చేశారు. వారి వద్దనున్న రూ.4,050ల నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేస్తున్న దృశ్యం

**పొందూరు:** మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు కోరారు. మణిపూర్ దారుణకాండను నిరసిస్తూ పొందూరులోని అంబేడ్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం మానవహారం నిర్వహించారు. యువతులను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలు, హత్యలకు పాల్పడడం దురదృష్టకరమని నినాదాలు చేశారు. ఈ సంఘటనలకు కారణమైన, ప్రేరేపిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు సీహెచ్ ప్రభుదాసు, జీవన్, వసంత్‌కుమార్, నాగేశ్వరరావు, శ్రీను, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

# అరసవల్లిలో భక్తజనం



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని అధిక శ్రావణ ఆదివారాన భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి విచ్చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని స్వామి దర్శనాలకు బారులు తీరారు. కేశఖండన శాలలో తలనీలాలకు అదనపు డబ్బులు వసూళ్లు చేయకుండా ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పాటు ఆడియో రికార్డును వినిపించడంతో దాదాపుగా అదనపు వసూళ్ల ఇబ్బందులు తగ్గాయి. అంతరాలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను ఈవో వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. రూ.500 విశిష్ట దర్శనాలతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనాల లైన్లలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. కొత్తగా రూ.300తో ఆలయ మండపాల్లోని సూర్యనమస్కార పూజలకు ఎగ్జిట్ ద్వారం నుంచి ప్రత్యేకంగా అనుమతివ్వడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

**ఉచిత హోమియో మందుల పంపిణీ..**

ఆలయంలో దర్శనానికి వచ్చిన భక్తులకు అవసరం మేరకు ఉచితంగా హోమియో మందులను మహాలక్ష్మి హోమియో క్లినిక్ డాక్టర్ పూజారి స్వాతి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రత్యేక చికిత్సలపై వివరించారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్య విధానం ఇదని, రోగనిరోధక శక్తిని పెంచేలా చికిత్సలుంటాయని డాక్టర్ స్వాతి వివరించారు.

## కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు విరాళం

**కోటబొమ్మాళి:** మండల కేంద్రంలో అక్టోబర్ 17వ తేదీ నుంచి నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాల తొలిరోజు సాంస్కృతిక కార్యక్రమానికి రూ.1.25 లక్షలను అందజేయనున్నట్లు వైద్యుడు దానేటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉత్సవాలు బాగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఈవో వాచకచర్ల రాధాకృష్ణలకు సూచించారు.

### నేడు సమగ్రాభివృద్ధి సంకల్ప యాత్ర

**పాతపట్నం:** నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సమగ్రాభివృద్ధి సంకల్పయాత్రను సోమవారం నిర్వహిస్తున్నట్లు వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని తన స్వగృహం వద్ద ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట గ్రామం నుంచి ఉదయం పది గంటలకు బయలుదేరి పాతపట్నం వెళ్లి సమగ్రాభివృద్ధి సంకల్పయాత్ర ర్యాలీగా వెళ్లి ప్రారంభిస్తామన్నారు. అలాగే హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో సంకల్పయాత్ర ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. సరాలి సర్పంచ్ షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ రాజారావు ఉన్నారు.

## వసతిగృహాల్లో 418 సీట్లు భర్తీ



వసతి గృహాల వార్డెన్లతో ఎమ్మెల్యే కృష్ణదాస్

**నరసన్నపేట:** నియోజకవర్గంలోని 11 వసతి గృహాల్లో 418 సీట్లను భర్తీ చేశారు. వసతి గృహాల్లో ఉన్న ఖాళీల భర్తీకి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన సమావేశం ఆదివారం నిర్వహించారు. దీంట్లో ఎనిమిది బీసీ వసతి గృహాల్లో 359, మూడు ఎస్సీ వసతి గృహాల్లో 59 సీట్లు భర్తీ అయ్యాయి. నరసన్నపేట బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో 93, దేశవానిపేటలో 93, ప్రియాగ్రహారంలో 24, జలుమూరులో 24, పోలాకిలో 43, ఉర్లాంలో 25, బాలురు కళాశాల వసతి గృహంలో 58, శ్రీముఖలింగంలో 21 సీట్లను భర్తీ చేశారు. ఎస్సీ వసతి గృహాలకు సంబంధించి నరసన్నపేటలో ఎస్సీ బాలికల వసతి గృహంలో 23, కోడూరులో 19, జలుమూరులో 17 సీట్లు భర్తీ అయ్యాయి. సమావేశంలో బీసీ ఏఎస్‌డబ్ల్యూ త్రినాథరావు, వసతి గృహాల మేట్రిన్లు, వార్డెన్లు పాల్గొన్నారు.